# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# మంచుపర్వతం

" అదేమిటి గంగా, పొద్దున్నే అలా కూర్చోకపోతే కాస్త వంటింట్లోకి వెళ్ళి అమ్మాయికి సహాయం చెయ్యచ్చు కదా, పది పనుల మధ్యలో ఒక్కర్తీ ఇబ్బందిపడుతోంది" అన్నాడు రఘురాం భార్యని చూస్తూ.

" అబ్బే, నా ముతకపనులు వీళ్ళకి నచ్చేవి కాదులెండి" అంటూ దీర్ఘం తీసింది ఆవిడ.

మరొక అరగంటలో ఎక్కడివారక్కడకి వెళ్ళగా ఆ పెద్ద దంపతులిద్దరూ మిగిలారు.

"ఏం అమెరికానో, ఏమో? ఎప్పుడొచ్చినా బంగారు పంజరంలా అనిపిస్తుంది తప్ప మరోలా కాదు, వాడి పెళ్ళయిన తర్వాత ఇది మూడోసారి మనం రావడం, ప్రతీసారీ ఇంతే, ఆయనెవరో చెప్పినట్టు వారమంతా జైలు, వారాంతాల్లో బెయిలు" అందావిడ నిట్టూరుస్తూ.

"ఏదయినా మనం అనుకోవడంలో ఉంది గంగా, ఓ కప్పు కాఫీ తాగుదామా? కొద్దిగా చలిగా ఉంది" అన్నాడాయన దానికి నవ్వుతూ.

"ఏది వచ్చినా, రాకపోయినా నేనన్న మాట చమత్కారంగా మార్చడం మాత్రం బాగా తెలుసు, పైగా తాగుదామా అట. తాగాలని ఉంది, కలుపు అని చెప్పడమే కదా? " అంది దెప్పుతున్నట్టు.

అప్పటికే అతను అక్కడ లేడు, "ఏమైపోయాడా?" అని వెనుతిరిగి చూసేంతలో రెండు కప్పులతో ప్రత్యక్షమయ్యాడు.

"మీరు కాఫీ?" అని ఆమె అంటూ ఉండగానే, "మైక్రోవేవ్ ఓవెన్ లో ఎలా కలపాలో కోడలు చూపించింది నిన్ననే, అద్భుతంగా కలిపాను. దా, డెక్ మీద కూర్చుని తాగుదాం" అంటూ బయటకు దారితీశాడు.

కాలిఫోర్నియా వాతావరణం ఆహ్లాదంగా ఉంది, మెల్లగా వీస్తున్న గాలి, చిరు చలిని పారదోలడానికి ప్రయత్నిస్తున్న మెత్తని, వెచ్చని ఎండ. ఇద్దరూ డెక్ మీద కూర్చుని మెల్లిగా కాఫీ తాగసాగారు, చిన్న ప్లేట్ లో బిస్కట్లున్నాయి మధ్యలో.

"నీ మనసులో ఏముందో చెప్పు గంగా, ఎందుకీ ముభావం? నీ ప్రవర్తనతో మనం ఇక్కడున్న నాలుగురోజులూ సరదాగా ఉండకుండా నువ్వు బాధపడుతూ, అందరినీ బాధపెడుతున్నావు. ఆ విషయమైనా గ్రహించావా?" అన్నాడాయన సూటిగా.

" నాకు తెలుసు, మీరు కూడా నన్నే అంటారు, అందరికీ నేనే కదా లోకువ" అంది ఆవిడ అక్కసుగా.

"చూడు, ఊరికే ఇలా సంభాషణని పక్కదోవ పట్టిస్తే వచ్చే లాభమేమీ లేదు, వాడి పెళ్ళయి ఏడేళ్ళు దాటుతోంది, వాడూ, భార్యా పిల్లలు ఎంతో ముచ్చటగా ఉన్నారు, ఈ ఏడేళ్ళలో మనం ఇక్కడికి రావడం ఇది మూడోసారి, వాళ్ళు రెండు సార్లు వచ్చారు, ప్రతీసారీ నీ వరస ఇలాగే ఉంటోంది. ఎంత సుఖంగా ఉన్నారో, ఎంత పొందికగా సంసారం చేసుకుంటున్నారో మనకి తెలియనిదేమీ కాదు, ఎన్నడానికీ, ఎంచడానికీ ఏమీ లేదు. ఆ అమ్మాయి కూడా తనకి వీలున్నంతవరకూ మనల్ని ఎంతో సుఖంగానూ, సంతోషంగానూ ఉంచే ప్రయత్నం చేస్తుంది, ఇంకేమిటి నీ బాధకి కారణం? మనం చూసిన సంబంధం చేసుకోలేదన్న ఒక్క విషయం తప్ప నువ్వు మాత్రం ఇంత బెంగ పడటానికి మరేమీ లేదు. ఈ మధ్య మన పల్లెటూళ్ళల్లోనే ఇవన్నీ ఎంతో సాధారణంగా జరుగుతున్నాయి, అలాంటిది ఈ పెద్ద పట్నల్లో వేరే అడగాలా? మనమేమీ చిన్నపిల్లలం కాదు, బొత్తిగా పరిణతి లేకుండా ఇలా ప్రవర్తిస్తే బావుంటుందా చెప్పు? ఊరికే వెనక్కి వెళ్ళిపోదామని ఎందుకంత మంకుపట్టు?" అన్నాడాయన అనునయంగా.

ఆవిడేమీ మాట్లాడకుండా కూర్చుంది. ఖాళీ కప్పులు లోపల పెట్టే మిష మీద లోపలకి వెళ్ళబోతున్న ఆమెని చెయ్యి పట్టుకుని ఆపాడు.

"ఆగు. నీ మనసుకొచ్చిన కష్టమేమిటో చెప్పు, వెంటనే వెళ్ళిపోదాం అంతేకానీ సరి అయిన కారణం లేకుండా ఇలా అర్థాంతరంగా వెళ్ళడం బావుండదు కదా" అన్నాడు.

"మీకు తెలుసు, మీ కన్నీ తెలుసు, అయినా నా నోటితోనే చెప్పించాలని, అంతకంటే ఏమీ లేదు, నిన్న రాత్రి సహన మీతో మాట్లాడిన మాటలు నేను వినలేదనుకుంటున్నారా? పూర్తిగా కాకపోయినా విన్నాను, నాతో ఎలా వేగాలో అర్థం కావటం లేదట ఆవిడకి, అంతేనా? అవున్లెండి, అత్త ఎప్పుడూ శత్రువే, మామలందరూ మెదలకుండా జాగ్రత్తగా ఉంటారు కదా, అందుకే వాళ్ళెప్పుడూ మంచివారే. తరతరాలుగా జరుగుతున్నదే," అంది విసుగ్గా, కరుగ్గా.

పకపకా నవ్వాడు ఆ మాటలకి. " అయ్యో, పిచ్చిదానా, అదా నీ అనుమానం. భాష పూర్తిగా రాకపోతే ఇలాగే ఉంటుంది. ఆ అమ్మాయి నాతో అలా ఏమీ అనలేదు, వాసుకి నాలుగు నెలలు వాషింగ్ టన్ లో ట్రైనింగ్ ఉంది కదా, అందుకే కదా ఈ సారి మనం కోడలికీ, పిల్లలకీ తోడుకోసమే ఆరునెలలుందామని అనుకున్నాము. వాడు వచ్చేవారం బయలుదేరతాడు కదా, అదే నిన్న రాత్రి తను నాతో చెప్పింది.

నువ్వు ఇంకొంచం సంతోషంగా ఉంటే బావుంటుంది, "అత్తయ్యగారికి ఏ ప్రోబ్లెం లేకుండా సంతోషంగా ఉంటే అక్కడ వాసుకి కూడా బావుంటుంది, దానికోసం మనం ఏం చేస్తే బావుంటుందో మీరు చెప్పండి మావయ్యా" అని నన్ను అడిగింది. అంది అంతే కానీ నువ్వన్న అభాండాలేమీ కాదు, నీకు ఇంగ్లీష్ సరిగా రాక అలా అర్థం చేసుకున్నావు. " అంటూ మళ్ళీ నవ్వబోయాడు వాతావరణాన్ని తేలిక చెయ్యడం కోసం.

"నిజంగా అంతేనా? నేనే ప్రోబ్లెం అనలేదూ? " అంది అనుమానంగా.

" ఛ , ఛ అలా అనుకునే అమ్మాయయితే మనతో ఇంత చక్కగా ఎలా ఉంటుంది? మనతో ఎలా కలిసిపోతుంది? ఆలోచించు. ప్రతీ విషయానికీ రెండు వైపులుంటాయి గంగా, మనం ఏ వైపు చూస్తున్నమూ అన్నది ఎంత ముఖ్యమో, రెండు వైపులా చూడడం కూడా అంతే ముఖ్యం" అన్నాడు.

"ఏమో, నేనేమీ మీలాగా, మీ కోడలి లాగా చదువుకోలేదు కదా! మీరేం చెప్తే అది నమ్మడం తప్ప నాకు మరొక దారుందా? ఏవిటో? అసలు వాడు ఆ కన్నడం అమ్మాయిని ప్రేమించాను, పెళ్ళి చేసుకుంటాను అనగానే మనం గట్టిగా వద్దని చెప్పాల్సింది, వాడిష్టం, అలాగే కానివ్వమన్నారు, ఇంకేముందీ నావిలువ, ఆరోజే గంగలో కలిసింది ఈ గంగా భవాని పరువు" అంది ఉక్రోషంగా.

జాలిగా చూసాడు ఆమె వైపు. "ఇన్నేళ్ళయినా, ఇంత జరిగినా కూడా నీ ధోరణి గానీ, నీ ఆలోచనలు గానీ మారవా? ఏడేళ్ళయినా ఇంకా నువ్వు మర్చిపోలేదంటే అంటే అది నీ అమాయకత్వమో, పిచ్చితనమో, మొండితనమో అర్థం కావడం లేదు గంగా " అన్నాడు కొంచం కోపంగా.

ఆవిడేమీ మాట్లాడటం ఇష్టం లేనట్టుగా ముఖం పక్కకి తిప్పుకు కూర్చుంది, ఆవిడ ప్రస్తుతం ఉన్న మూడ్ లో మరేదైనా చెప్పినా వినదని గ్రహించి, మళ్ళీ మాట మారుస్తూ,

" మధ్యాహ్నం భోజనంలోకి కోడలు ఏం వండిందో చూడు, ఏదైనా పచ్చడి చేస్తావా?" అన్నాడు.

ఆవిడ లోపలకి వెళ్ళింది, వాలు కుర్చీలో కూర్చుని ఆవిడ వెళ్ళినవైపే చూడసాగాడు. ఇన్నేళ్ళ కాపురంలో తను అర్థం చేసుకోలేనిది ఇదొక్కటే, ఆవిడది అమాయకత్వమా? అతిశయమా?

రఘురాం, గంగాభవానిలది గోదావరి జిల్లాలోని ఒక పల్లెటూరు. ఆయన స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగం చేసేవాడు, చాలావరకూ చుట్టుపక్కల ఊర్లలోనే పోస్టింగ్ లు ఉండటం చేత సొంత ఊరిలోనే కుటుంబాన్ని ఉంచి, తనే తిరుగుతూ ఉండేవారు.

మావయ్య కూతురు గంగాభవాని తో వివాహం, నలుగురు పిల్లలూ, తల్లితండ్రులతో కలిసిన ఉమ్మడి కుటుంబం, ఆయన జీవితం చాలా హాయిగా గడిచిపోయింది అనే చెప్పాలి. ముగ్గురు కూతుళ్ళ తర్వాత పుట్టాడని కొడుకు వాసు అంటే ఆయనకీ, భార్యకీ కూడా కాస్త గారాబం ఎక్కువే, ముఖ్యంగా గంగాభవానికి. గంగ పెద్దగా చదువుకోకపోయినా గానీ చాలా సమర్ధురాలు, చాలా తెలివైనది, భర్త దగ్గరలేకపోయినా ఇంటినంతా ఎంతో జాగ్రత్తగా నడిపేది. ఆవిడ మొదటినించీ చాలా పట్టుదల కల మనిషి, తన మాటే నెగ్గాలి, తను అనుకున్నదే జరగాలి, తను ఆలోచించేదే రైటని ఆమె భావన. భర్తన్నా, పిల్లలన్నా, అత్తమామలన్నా ప్రాణం పెడుతుంది, కానీ ఏ విషయం లోనైనా తన మాట నెగ్గకపోతే మాత్రం సహించలేదు.

ఆడపిల్లలు ముగ్గురినీ తమ ఊర్లోనూ, దగ్గరలో ఉన్న కాలేజీల్లోనూ చదివించారు.

కానీ కొడుకు విషయం వచ్చేసరికి, అతను పట్నాల్లో ఉండి పెద్ద పెద్ద చదువులు చదవాలని ఆమె ఆశ పడింది. తన చెల్లెలి కొడుకులూ, అన్నయ్య పిల్లలూ హైదరాబాదు లాంటి పట్నాల్లో చదువుకుంటూ, స్టైల్ గా ఇంగ్లీష్ లో మాట్లాడుతూ ఉంటే ఆవిడ మనసు కొట్టుకుపోయేది.

"ఒక్కడినీ అక్కడెక్కడో ఉంచి చదివించాలి కదా, అమ్మాయిలు చదువుకున్నట్టు వాడూ చదువుకుంటాడు, వాడికి రాసిపెట్టి ఉంటే అలాగే గొప్ప చదువులు చదువుకుంటాడు" అనేవాడు రఘురాం.

"అలా మెట్టవేదాంతం చెప్పకండి, నాకు ఒళ్ళు మండిపోతుంది, నా బిడ్డ ఎలాగైనా పెద్ద చదువులు చదివి మహానగరాల్లో పెద్ద పెద్ద ఉద్యోగాలు చెయ్యాలి, మావాడు అమెరికాలోనో, లండన్లోనో ఉన్నాడు అంటే ఎంత గొప్పగా ఉంటుంది? అమ్మాయిల చదువులనాటికీ, ఇప్పటికీ రోజులెంత మారాయి? అందరూ ఫారెన్ డిగ్రీలు తెచ్చుకుంటుంటే మన అబ్బాయి మాత్రం ఎందుకు వెనక ఉండాలి?" అని వాదించి, ఒప్పించి వాసుని ఏడో క్లాస్ లో ఉండగా హైదరాబాదులో చెల్లెలి ఇంట్లో ఉంచి చదివించింది.

'ఎక్కడో ఆవిడ చెప్పినదాంట్లో నిజముంది' అనుకున్నాడేమో అందుకే రఘురాం మరి తర్కించలేదు, కానీ రోజూ తన పెద్ద అరటి ఆకు పక్కనే, చిన్న ఆకు వేసుకుని కూర్చుని, అన్నం తిని, తనకి నిద్ర వచ్చేవరకూ కథలు చెప్పించుకుంటేనే గానీ నిద్రపోని కొడుకు పక్కన లేని వెలితి కి ఆయన అలవా టు పడటానికి చాలా కాలం పట్టింది.

'అప్పటినించీ వాడికి సెలవులెప్పుడిస్తారా?' అని ఎదురుచూడటంతోనే సరిపోయేది ఆయనకి.

వాసు బాగా చదువుకుని మంచి కాలేజీలో ఇంజనీరింగ్ లో చేరాడు, ఆ తర్వాత అమెరికాలో పై చదువులు చదువుకుంటానని చెప్పాడు, దానికి రఘు ఏదో చెప్పబోతే గంగ వెంటనే అందుకుని

" ఈ రోజుల్లో అందరూ అమెరికాల్లో చదువులూ, ఉద్యోగాలూ చేస్తూ ఉంటే మన బిడ్డ మాత్రం ఇక్కడ ఉండి ఏం చేస్తాడు? వాడి స్నేహితులూ, మన చుట్టాల పిల్లలూ అందరూ వెళుతుంటే వాడి మనసుకు మాత్రం అనిపించదూ? మనకేం లేదా, పోదా? వాడికి చదువు చెప్పించలేమా?" అంటూ ఆయనకెదురు వచ్చింది.

"గంగా, అందరూ ఇలాగే ఆలోచిస్తే మన దేశంలో ఎవరూ మిగలరు? యువతరం అందరూ తాము నేర్చుకున్న చదువూ, విజ్ఞానమూ తమ దేశ అభివృద్ధికి వినియోగించాలి అన్నది నా భావన. మోజుతో ముందు వాళ్ళని దూరాలు పంపి ఆ తర్వాత వాళ్ళ కోసం కలవరించడం అనవసరమని నా అభిప్రాయం. ఆ తర్వాత నీ ఇష్టం, వాడి ఇష్టం" అని మాత్రం అని ఊరుకున్నాడు.

ఆ తర్వాత కార్యక్రమాలన్నీ చక చకా జరిగిపోయాయి. వాసు కాలిఫోర్నియాలో ఒక మంచి యూనివర్సిటీలో సీటు తెచ్చుకున్నాడు, స్కాలర్షిప్ కూడా రావడంతో అతని చదువు హాయిగా సాగింది. అది అవగానే అక్కడే ఉద్యోగం వచ్చిందని అతను ఫోన్ చేసిన రోజు గంగా

భవానికి ఆనందంతో అన్నం సహించలేదు, నిద్ర పట్టలేదు. ఊరు వాడా పెద్ద సంబరం చేసింది. ముగ్గురు కూతుళ్ళకీ, కుటుంబాలకీ కొత్త బట్టలు కొంది. పిండివంటలు చేయించి ఊరంతా పంచింది. వాసు బారసాల తర్వాత, అంత ఘనంగానూ వేడుక చేసింది.

ఇక అప్పటినించీ ఆవిడ ఆలోచనల్లో మార్పు వచ్చింది. " మన చుట్టుపక్కల ఎవరూ ఇంత చదువుకో లేదు అది కూడా అమెరికాలో, వింటున్నారా? ఇప్పుడింక అమ్మాయిల తల్లితండ్రులు మన ఇంటి ముందు క్యూ కడతారు. లక్షల్లోనే కట్నాలూ, లాంఛనాలు" అంటూ మురిసిపోయేది.

"తప్పు గంగా! కట్నకానుకలు ఆశించడం, తీసుకోవడం నేరం, అయినా నువ్వే అంటావు కదా, మనకేం తక్కువయిందని? మరి అలాంటప్పుడు వచ్చే అమ్మాయినించి కట్నకానుకలు ఎందుకు ఆశించాలి?" అనేవాడు.

ఆవిడ ఒప్పుకునేది కాదు. " కట్నకానుకలు లేని పెళ్ళీ, ఒక పెళ్ళేనా? నలుగురిలో చిన్నతనం కాదూ?" అనేది. అప్పటినించీ వాసు ఫోన్ చేసినప్పుడల్లా తాను సేకరించిన వివిధ సంబంధాల వివరాలన్నీ చెప్తూ ఉండేది.

ఒక రోజు పొద్దున్నే వాసు దగ్గరనించి ఫోన్.

"ఏమండోయ్, అబ్బాయి ఫోన్, మీతో ఏదో మాట్లాడాలిట" అంటూ అరిచింది గంగ.

"వాడిని పెళ్ళి సంబంధాలూ, పెళ్ళీ, అంటూ ఊదరగొట్టేసావా? నాతో మాట్లాడాలంటున్నాడు" అంటూ నవ్వుతూ వెళ్ళాడు ఫోన్ తీసుకోవడానికి.

"మీకెప్పుడూ నన్ననడం తప్ప మరొకటి రాదు, మన ఎరిక లో ఉన్న నాలుగు సంబంధాల గురించి చెప్పాను, తప్పా? వయసొచ్చింది, మంచిది చూసి మాట్లాడుకుంటే, వాడు వచ్చినప్పుడు పెళ్ళి చూపులూ, అవీ ఏర్పాటు చేసుకుని ముహూర్తాలు పెట్టుకోవచ్చు" అంది సంబరంగా.

"కంగారు పడకు " అని ఆమెతో అంటూ

" చెప్పు నాన్నా, ఎలా ఉన్నావు?" అంటూ కొడుకుతో మాట్లాడటం మొదలు పెట్టాడు.

"బావున్నాను నాన్నా, ఈ మధ్య ఎప్పుడు ఫోన్ చేసినా అమ్మ పెళ్ళి మాటలే చెప్తోంది" అని ఆగాడు.

"నిజమే, ఏ వయసులో జరిగేవి ఆ వయసులో జరిగితే మంచిదే కదా నాన్నా, నీ అభిప్రాయమేమిటో చెప్తే దాన్ని బట్టి మనం మిగతా విషయాలు ప్లాన్ చేసుకోవచ్చు" అన్నాడు రఘురాం.

"అదే నాన్నా, ఆ విషయమే మీతో చెప్పాలని" అంటూ ఆగాడు.

"అమ్మతో ఎలా చెప్పాలో తెలియలేదు. నేను నా కొలీగ్ సహన అనే కన్నడ అమ్మాయిని ఇష్టపడుతున్నాను" అంటూ విషయం నెమ్మదిగా చెప్పాడు.

"ఇప్పుడు అమ్మకెలా చెప్పాలో, మీరే చూడాలి నాన్నా!, తన మనసునొప్పించడం నా ఉద్దేశ్యంకాదు, కానీ చెప్పి ఒప్పించడం కూడా నాకు కష్టమే, అమ్మ సంగతి మీకు తెలియనిదేముంది? " అన్నాడు సందిగ్ధంగా.

"సహన చాలా మంచి అమ్మాయి నాన్నా, వాళ్ళది బెంగుళూరు, నాన్న లేరు, అన్నయ్య, అమ్మా తను, అంతే వాళ్ళ కుటుంబం. రెండేళ్ళుగా తెలుసు నాకు, చాలా మంచివాళ్ళు " అంటూ దాదాపు అరగంట సేపు చెప్పాడు.

అతన్ని మధ్యలో ఆపడం ఇష్టంలేక ఆసాంతం విన్నాడు రఘురాం.

" మీరే ఎలాగైనా, అమ్మకీ, బామ్మకీ చెప్పి ఒప్పించాలి నాన్నా, నాకైతే వాళ్ళిద్దరికీ చెప్పే ధైర్యం లేదు కానీ సహన తో కాక మరొకరితో నా జీవితాన్ని ఊహించుకోలేను." అన్నాడు చివరగా.

" చూద్దాంలే నాన్నా, ఏదో ఒకటి ఆలోచిద్దాం" అన్నాడు మరేమనాలో తెలియక.

ఎప్పటిలా జాగ్రత్తలు చెప్పేసి ఫోన్ పెట్టేశాడు.

" అయ్యో అప్పుడే ఫోన్ పెట్టేశాడా? నేను మళ్ళీ మాట్లాడదామని అనుకున్నాను " అంటూ వచ్చింది గంగ. " అయినా మీతో అంతసేపు ఏం మాట్లాడాడు? పైగా మీరు కూడా గుసగుసలు. ఏవిటో విషయం?" అంది.

ఎలా మొదలుపెట్టాలో తెలియక ఊరుకున్నాడు. 'ఆవులిస్తే పేగులు లెక్కపెట్టగల అసాధ్యురాలు' గంగ. "ఏదో ఉంది, మీరు నాకు చెప్పటం లేదు" అంటూ మొదలు పెట్టేసరికి ఇక తప్పదని నెమ్మదిగా విషయం చెప్పాడు. విషయం తెలిసిన వెంటనే భద్రకాళే అయింది గంగ.

"అలా అన్నాడా? నిజమేనా? నాతో వేళాకోళం ఆడుతున్నారా? అసలిలాంటిది మన ఇంటా వంటా ఉందా?" అంటూ మొదలు పెట్టింది.

"అబ్బా, గంగా ఊరుకో, ఏదైనా వినగానే ఎగిరి మీద పడకుండా ఆలోచించి నిదానంగా మాట్లాడటం మంచిది కదా," అన్నాడు రఘురాం.

"మీకసలేమీ తెలీదు, ఆ పిల్లెవరో వీడు ఎర్రగా అందంగా ఉన్నాడని చూసి పడేసి ఉంటుంది, ఈ ఆకర్షణలు వయసులో ఉన్నప్పుడు మామూలే, వాడు వచ్చాకా, నాలుగూ చెప్పి, నచ్చ చెపితే మన దారికొస్తాడు చూడండి" అంది.

" వాడి మాటలు చూస్తే నాకలా అనిపించడంలేదు గంగా, నువ్వు ఎక్కువ ఆశలు పెట్టుకోకు, ఇక్కడే ఉండి చదువుకుంటానన్నా, బలవంతంగా నాలుగు మాటలు చెప్పి పట్నం పంపినప్పటి చిన్నపిల్లాడు కాదు వాడిప్పుడు, ముప్పై దగ్గరపడుతోంది వాడి వయసు, వాడికేం కావాలో? వాడి జీవితం ఎలా ఉండాలో బాగా తెలిసిన బాధ్యత కల యువకుడు" అనాడు రఘురాం నిజాయితీగా.

అప్పుడేమీ మాట్లాడకపోయినా వాసు ఇండియా వచ్చినప్పుడు చాలా గొడవచేసింది గంగ. బెదిరించింది, బతిమాలింది అయినా వాసు సున్నితంగానే చెప్పినా, తన మాటమీదే ఉండిపోయాడు. తప్పని పరిస్థితుల్లో ఇష్టంలేని పెళ్ళికి ఒప్పుకోవలసి వచ్చిందావిడకి. పైకి చెప్పకపోయినా ఆ విషయాన్నంత తొందరగా మర్చిపోలేకపోయింది గంగ. దానివల్లనే వీలున్నప్పుడల్లా కొడుకు ఎదుటా, భర్త ఎదుటా తన అసంతృప్తినీ, కోపాన్నీ ప్రదర్శిస్తూనే ఉంటుంది.

పేరుకు తగ్గట్టే, సహన చాలా మంచి పిల్ల, సహనం కలది. తమ పెళ్ళి పట్ల అత్తగారికున్న వ్యతిరేకతని గ్రహించలేనంత అమాయకురాలు కాదు. అందుకే చాలా జాగ్రత్తగా ఉంటుంది ఆవిడతో, ఆమెకి నచ్చినట్టు వ్యవహరిస్తూ, వీలైనంత స్నేహంగా ఉండడానికి ప్రయత్నించేది. గంగా భవాని మాత్రం తన మూడ్ ఎలా ఉంటే అలా ప్రవర్తించేది. ప్రేమగానే ఉన్నట్టే ఉంటూ మధ్య మధ్యలో తన కోపాన్నీ, చికాకునీ ప్రదర్శిస్తూనేఉండేది. కానీ అది ఇంట్లో వారి వద్ద మాత్రమే కావడం వారి అదృష్టం. ఇతరుల దగ్గర మాత్రం ఎప్పుడూ కొడుకూ, కోడలూ, పిల్లల గురించి గొప్పగా చెప్తూ ఉండే భార్యనెలా అర్థం చేసుకోవాలో తెలీడం లేదు రఘురాంకి. అయినా సహన పట్టించుకునేది కాదు కనక ఇద్దరి మధ్యానా ఎప్పుడూ పెద్దగా గొడవలు రాలేదు. వారి పెళ్ళైన రెండేళ్ళకి కవలపిల్లలు హిమజా, హితేన్ పుట్టారు.

"నాకు నాలుగు నెలలు వాషింగ్టన్ లో ట్రైనింగ్ ఉంది నాన్నా, సహనకి సెలవు లేదు, నాకు కూడా వారానికో, రెండు వారాలకో వచ్చే వీలుండదు, పిల్లలకీ స్కూల్, మీరిద్దరూ రాగగిలితే వాళ్ళకి కొంత సాయంగా ఉంటారు కదా, మీకు వీలవుతుందా?" అని అడిగాడు వాసు ఒకనాడు ఫోన్ లో.

"అదేమిట్రా, నువ్వంతగా అడగాలా? మాకిక్కడ పెద్ద పనేమీ లేదు, నేను మొన్నే రిటైర్ అయ్యాను కదా, తప్పకుండా వస్తాం" అన్నాడయన వెంటనే.

" వాళ్ళమ్మ రానందా? వాడు లేకుండా మనమెందుకు వాడింట్లో?" అని గునిసింది గంగ.

"అలా మాట్లాడతావేం గంగా? పిల్లలకి అదీ ఎద్దైనా అవసరం ఉంటే ఒకరికొకరం, మనిద్దరం ఉండడం మంచిది కదా? పైగా ఆవిడ తన స్కూల్ పనుల్లో బిజీ గా ఉంటారు కూడా" అన్నాడు.

"అవును, అందరూ చదువుకున్నవారూ, బిజీగా ఉండేవారు, నేనొక్కదాన్నే" అంటూ ఇంకా ఏదో అనబోయి ఆయన కోపాన్ని చూసి ఆగిపోయింది.

అలా జరిగింది వారి ప్రయాణం. ఎంత సమాధానపరుచుకున్నా ఆవిడకి వాసు లేకుండా అక్కడ ఉండడం ఇష్టం లేదు, అందుకే ఏదో ఒక వంకన వెనక్కి తొందరగా వెళ్ళిపోదామని ఆలోచనలు చేస్తోంది. వాసూ, రఘురాం కూడా అది గ్రహించినా పట్టనట్టు ఊరుకోవడం మరింత కోపంగా ఉందావిడకి. పిల్లి మీదా, ఎలక మీదా పెట్టి ఏదో ఒక సాకు తెద్దామని చూస్తోంది. మూడు రోజుల క్రితం కోడలు భర్తతో అన్న మాటలు సగం వినీ, వినకా అదొక పెద్ద కారణంగా అలక సాధిస్తోంది అప్పటినించీ.

"సరిగ్గా చూడని కొడుకూ, కోడళ్ళుంటే బాధపడతారు ఎవరైనా, ఏదో మనసులో పెట్టుకుని ఇలా అనుక్షణం తను బాధపడుతూ, అందరినీ బాధ పెట్టే భార్య ఎప్పటికి మారుతుందో? వెనక్కి వెళ్ళిపోదాం అని గట్టిగా ఏడ్చి గొడవ చేస్తే తను, వాసూ మాత్రం ఏం చెయ్యగలరు?" అనుకున్నాడు.

ఇంతలో భోజనానికి పిలిచింది గంగ. ఆలోచనల్లోంచి బయటకి వచ్చిన అతను అన్యమనస్కంగానే భోజనం చేశాడు.

మర్నాడు శనివారం. వారమంతా ఉరుకులూ పరుగులతో అలిసిపోయి, నిద్రపోయిన ఇల్లు తీరిగ్గా మేల్కొంటోంది.

" చూశారా? పొద్దున్నే ఎవరూ నిద్రే లేవరు? మనం ఊరు తెల్లారకుండా నిద్ర లేచి చుక్కలు లెక్కపెట్టాలి" అని మొదలుపెట్టింది గంగ.

" ఉష్, లేస్తారులే, ఈరోజు సెలవు కదా" అని ఇంకా ఏదో అనబోతున్న రఘురాం పరుగున తమదగ్గరకొస్తున్న మనవల్ని చూసి ఆగి, నవ్వాడు.

" అరే అప్పుడే నిద్ర లేచారా? ఈ రోజు శనివారం కదా " అంటూ ఉండగానే.

" ఉష్ తాతయ్యా, నాన్నమ్మా, మాకు పొద్దున్నే మీ ఎయిర్ లైన్స్ వారిదగ్గరనించి ఫోన్ వచ్చింది, మీ బేగేజ్ మిస్ అయిపోయిందిట, మీరెలా వెళతారు ఇండియాకి ? " అంది ఐదేళ్ళ చిన్నారి హిమజ నడుం మీద చేతులుంచుకుని.

వెనకే, నోటిమీద చెయ్యి ఉంచుకుని నవ్వు ఆపుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నాడు హితేన్.

వాడి నవ్వు చూసిన హిమజ చిరాగ్గా "హుష్" అని ఒకసారి కసిరి, " నిజం తాతయ్యా, మీరు మీ రూం పక్కన క్లోసెట్ లో పెట్టుకున్న సామాన్లున్నాయేమో చూడండి " కావాలంటే అంది, ఎటో వేలు చూపిస్తున్న హితేన్ చెయ్యి ని వెనక్కి లాగుతూ.

మనవలేదో ఆట ఆడుతున్నారని అర్థం అయిన రఘురాం

"అదేవిట్రా? మేమింకా ప్లేన్ అయినా ఎక్కలేదు కదా? మరి బేగేజ్ ఎలా మిస్ అయింది? " అన్నాడు నవ్వుతూ.

"అలా కాదు తాతా, ఇది వినండి అంది " ఐదేళ్ళ హిమజ.

" చెప్పండి మేడం!" అన్నాడు చేతులు కట్టుకుంటూ.

" మీరు సిక్స్ మంత్స్ ఉంటామని వచ్చారు కదా యూ. ఎస్ కి. మరి టూ మంత్స్ లోనే వెళ్ళిపోతున్నారని ఎయిర్ లైన్స్ వాళ్ళకి తెలిసిపోయింది, అందుకే మీ బేగేజ్ మిస్ అయింది" అంది హిమజ పెద్ద ఆరిందాలా, నాటకంలో తన పోర్షన్ అయింది, అన్నట్టు గట్టిగా ఊపిరి పీల్చుకుంది..

"ఒహో, అలాగా, మరైతే మేము వెళ్తున్నట్టు వాళ్ళకి అప్పుడే ఎలా తెలిసిందిట? మనం ఇంకా టికట్స్ కూడా బుక్ చెయ్యలేదు కదా, వీళ్లెవరో చాలా తెలివైనా వాళ్ళలా ఉన్నారు సుమా " అన్నాడాయన.

"అవునవును, యూ ఆర్ రైట్" అంది తొందరగా

సగం మనవల వచ్చీ రాని తెలుగులోనూ, మిగతా సగం ఇంగ్లీష్ లోనూ జరుగుతున్న ఆ సంభాషణ అర్ధం అయ్యీ అవనట్టుగా ఉంది గంగాభవానికి. మెల్లి మెల్లిగా అర్ధం చేసుకుంటోంది.

"నిజమే కదా, ఇప్పుడెలా వెళతాం? మీ నాన్నమ్మ అన్ని మంచి చీరలు తెచ్చేసుకుంది కదా, అక్కడ పాత చీరలు తప్ప కట్టుకోవడానికేమీ లేవు, నేనేమో ఉన్న డబ్బులన్నీ తెచ్చేసుకున్నాను, టిక్కట్లకీ అదీ, ఇప్పుడెలాగబ్బా?" అని ఆలోచనలో పడ్డాడు రఘురాం. .

పసిపిల్లల అమాయకత్వం మనసుని తడుపుతున్నా ఆమె ఊపిరి ఉగ్గబట్టుకుని చూస్తోంది.

"అవును కదా, అందుకే కదా మేము చెప్పేది, మీరిద్దరూ ఆరునెలలూ ఇక్కడే ఉంటే, డాడీ తో చెప్పి ఎయిర్ లైన్స్ వారితో మాట్లాడమనవచ్చేమో, అమ్మని అడిగి వస్తాను" అంటూ లోపలకి తుర్రుమంది తూనిగలా హిమజ.

హితేన్ మాత్రం ఒక చెయ్యి నోటి మీదా, మరొక చెయ్యి పొట్టమీదా, ఉంచుకుని నవ్వాపుకోలేకా, విషయాన్ని దాచలేకా సతమవుతున్నాడు.

"ట్రై చేస్తాను అన్నారు డేడీ" అంది హిమజ. తను కూడా కంగారు పడ్డట్టు నటించసాగాడు రఘురాం. పిల్లలు కూడా తాత పక్కన చేరి తలమీద వేలు పెట్టుకుని ఒకరు, గడ్డం కింద చెయ్యి పెట్టుకుని మరొకరూ కూరుచున్నారు. ఎంతో ముచ్చటగా ఉన్న ఆ తతంగాన్ని చూస్తుంటే అప్రయత్నంగానే, గంగా భవాని పెదవులమీద చిరునవ్వు వచ్చి చేరింది.

"నెక్స్ట్ వీక్ నానమ్మ బర్త్ డే అని అమ్మ చెప్పింది, దానికోసమని ఎర్ర చీర కొనుక్కుంది అని చెప్పింది కదా, ఇప్పుడు బేగేజ్ లేదు కదా మరి అది ఎలా కట్టుకుంటుంది?" అల్లరిగా అడిగాడు రఘురాం మనవలని.

"ఆ తాతా, నాదొక ఐడియా. వన్ మినట్" అంటూ గదిలోకి పరిగెత్తాడు హితేన్. వెళ్ళినవాడు రెండు క్షణాల్లో తిరిగి వచ్చాడు, వాళ్ళ అమ్మది ఎర్ర చున్నీ ఉంది వాడి చేతిలో.

"చూడు తాతా, ఇది అమ్మది, అయినా నాన్నమ్మకి ఇమ్మని చెప్పచ్చులే, ఇస్తుంది, ఇది కూడా రెడ్ కలరే కదా, ఇది కట్టుకోవచ్చు నానమ్మ, మనం కావాలంటే మేచింగ్ కేక్ " లిటిల్ రెడ్ రైడింగ్ హుడ్' కేక్ తేవచ్చు, షీ విల్ బీ హేపీ " అన్నాడు సంబరంగా. అథాట్టుగా వాడిని ముద్దు పెట్టుకున్నాడు రఘురాం.

"ఛీ, పిచ్చీ, నానమ్మ లిటిల్ కాదు, బిగ్! సొ ఇట్ హేస్ టు బీ బిగ్ రెడ్ రైడింగ్ హుడ్" కేక్ అని సరిదిద్దింది హిమజ. " అంటే తెలుగులో పెద్ద అని ఉండాలి కదా తాతా " అని అడిగింది తాతని.

ఆ పసి మనసుల పసిడి తనపు అమాయకత్వాన్ని చూస్తున్న గంగా భవానికి నవ్వాగలేదు. వాళ్ళ వెనకే కొడుకు బెడ్ రూం ముందరున్న వాకిన్ క్లోసెట్ కున్న కర్టెన్ కిందనించి తమ ఇద్దరి సూట్ కేసుల చక్రాలు కనిపిస్తున్నాయి ఆవిడకి స్పష్టంగా.

అవునవును. "బిగ్ రెడ్ రైడింగ్ హుడ్' బావుంది ఐడియా "వెంటనే ఒప్పుకున్నాడు హితేన్.

వాడా మాట అనగానే ఒక్క ఉదుటున మనవలిద్దరినీ దగ్గరకి తీసుకుంది గంగాభవాని.

"మేమంటే ఎంత ప్రేమర్రా మీకు బంగారాలూ" అని మాత్రం అనగలిగింది, కాటుక పెట్టిన ఆమె కన్నుల్లో కనీ కనిపించని నీటి తెర.

" మేమెక్కడికీ వెళ్ళడంలేదులే, మా పెట్టెలు ఇచ్చేస్తారేమో అడగమనండి మీ అమ్మని" అంది కూడా.

"ఏ, " అంటూ నానమ్మకి ముద్దులు పెట్టారు ఇద్దరూ.

"హిమా, వాట్ ఈజ్ హేపెనింగ్? పొద్దున్నే నాన్నమ్మా వాళ్ళని ట్రబుల్ చేస్తున్నారా?" అంటూ వచ్చింది సహన.

"లేదమ్మా, వాళ్ళేమీ అల్లరి చెయ్యడం లేదు, ఊరికే సరదాగా ఆడుకుంటున్నాము" అంది గంగా భవాని మనస్పూర్తిగా.

అలా అంటున్న అత్తగారివైపు వింతగా చూస్తూ మావగారిని కళ్ళతోటే అడిగింది " విషయమేమిటి?" అని.

"మరేమీ లేదమ్మా, ఇన్నేళ్ళుగా బెట్టు పోతున్న మీ అత్తయ్య ఆ పొరలు తొలగించుకుని బయటపడుతోంది, ఆవిడేమైనా సామాన్యమైనదా? సాక్షాత్తూ గంగాభవాని.

అలనాడు భగీరథ ప్రయత్నానికి మాత్రమే, మాటవిని నేలజారింది ఆ సురగంగ. ఇన్నాళ్ళకి తన మనవల ప్రేమాభిమానలకి మనసుకరిగి నీరవుతోంది ఈ గంగ. అంతే!

ఒకసారి కరగడమంటూ మొదలుపెడితే ప్రేమానురాగాలు కురిపించడమే తెలిసిన మన ఊరి గంగమ్మా మీ అత్తయ్య. మనసులో ఏనాటినించో ఘనీభవించిన ప్రేమానురాగాలు పూర్తిగా చూపడానికి అడ్డుగా పెట్టుకున్న పట్టుదలా, బెట్టుసరీ లాంటి తెరలు చెదరి, కరిగి నీరవుతున్న మంచుపర్వతమమ్మా, ఈ మంచుకొండ వారి ఆడపడుచు" అని కళ్ళతోనే చెప్పాడు.

వచ్చేవారం అందరూ వాసుని ట్రైనింగ్ కోసం వాషింగ్టన్ ఫ్లైట్ ఎక్కించారు.

●●●

Click here to share your comments on this story